# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

**SEPTEMBER - 2016**

సంవత్సర చందా రూ. 50/-

# బైబిలు లెక్చర్‌షిప్

## సత్యవాణి - క్రీస్తు సంఘము

స్థలము : క్రీస్తు సంఘము,
7-9-35, సాంబమూర్తి వీధి, సత్యవాణి,
కాకినాడ

తేదీలు : 2016 నవంబరు 8,9,10, 11
మంగళ, బుధ, గురు, శుక్రవారములు

సమయం : ఉదయం 10.00 గం॥లకు
మధ్యాహ్నం 2.00 గం॥లకు
సాయంత్రం 7.00 గం॥లకు

ప్రసంగీకులు : బ్రదర్. థెర్మన్ హోడ్జ్, యు.ఎస్.ఎ.
బ్రదర్. రోజర్ రైట్, యు.ఎస్.ఎ.
బ్రదర్. లూయిస్ రష్‌మోర్, యు.ఎస్.ఎ.
బ్రదర్. జాన్‌డీన్, ఇండియా మరియు
బ్రదర్. జ్ఞాన సుధీర్, ఇండియా

మీరు సకుటుంబ సపరివారముగా, మీ స్థానిక సంఘముతో కలసి రండి. భోజన వసతులు ఉచితం. మొదటిరోజున 20 రూపాయలు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించవలెను. అందరికి స్వాగతం.

బ్రదర్. జాషువా గూటం
బ్రదర్. రిక్కీ గూటం

0884 - 2363722
98489 98547

# సత్యవాక్కు

THE WORD OF TRUTH

P.O. Box - 80, Kakinada, A.P. 533 001.

Ph : 0884-2363722 Cell : 98489 98547

Editor

**JOSHUA GOOTAM**

Pleading for Restoration of First Century Christianity

సంపుటిక - 37 సెప్టెంబరు - 2016 సంచిక -2


## క్రైస్తవ కార్మికుడు

## *(The Christian Employee)*

పనిచేయువారు యధార్థమైన హృదయము గలవారై భయముతోను వణకుతోను శరీరవిషయమైన యజమానులకు విధేయులై యుండవలెననియు, యజమానులు వారికి యజమానుడైనవాడు పరలోకమందున్నాడనియు, ఆయనకు పక్షపాతము లేదనియు ఎరిగి వారిని బెదిరించుట మాని ఆ ప్రకారమే చేయవలెననియు యేసుప్రభువు హెచ్చరించు చున్నారు (ఎఫెసి 6:5-9). గనుక క్రీస్తు మతము యజమానులవైపు లేక దాసులవైపు పక్షపాతము గలదని మనము చెప్పుకొనలేము. యేసుక్రీస్తు బోధవలన ఈనాడు బానిసత్వము సంపూర్తిగా నిర్మూలించ బడియున్నది. అయినను కార్మికులకును యజమానులకును మధ్య ఉండవలసిన గౌరవ మర్యాదలు నిలిచియున్నవి. క్రీస్తు తన సంఘము రక్తపాతముతో కూడిన ఒక విప్లవ సంస్థగా చేయలేదు. గాని బోధనల ద్వారా బానితస్వమును ప్రజలలో నుండి క్రైస్తవ మతము నిర్మూలించ గలిగెను. అందునలన ప్రతి క్రైస్తవ కార్మికుడు నిజానికి ప్రతి క్రైస్తవుడు కూడ తాను క్రీస్తు సువార్తకు తగిన జీవితము జీవించుచున్నాడో లేదో జాగ్రత్తగా చూచుకొనవలెను (ఫిలిప్పీ 1:27).

ఒక కర్మాగారములోనో లేక ఒక ఆఫీసులోనో పనిచేయు క్రైస్తవుడెట్లుండవలెను? అనే ప్రశ్న మనకు రావచ్చును. క్రైస్తవుడు తన పనిలో మోసము చేయుట, అబద్ధములాడుట మంచిది కాదని యెరిగినవాడై యుండును. అతడు తనశక్తి కొలది, ఇయ్యబడిన సమయ మంతటిలోను కష్టపడి పని చేయును. అతడు

సమయమునకు ఖచ్చితముగా పనికి వెళ్ళును. నిష్కటముగా పనిచేయును. అతని నిష్కపట కృషినిబట్టి, సత్ప్రవర్తనను బట్టి తన పై యజమానులు అతడు క్రైస్తవుడని గుర్తెరుగుదురు. అందువలన క్రైస్తవ కార్మికుడు సహృదయుడై పనిచేయుట ఎంతో అవసరము.

**క్రైస్తవ కార్మికుడు సత్యము చెప్పువాడై యుండవలెను.** "ఒకనితో ఒకడు అబద్ధమాడకుడి. ఏలయనగా ప్రాచీన స్వభావమును దాని క్రియలతో కూడ మీరు పరిత్యజించి జ్ఞానము కలుగు నిమిత్తము దాని సృష్టించినవాని పోలిక చొప్పున నూతన పరచబడు చున్న నవీన స్వభావమును ధరించు కొని యున్నారు" (కొలస్స 3:9). అబద్ధములాడుట వలన మిత్రులు విడిపోవుదురు, కుటుంబములు కూలిపోవును. కర్మాగారములలోను, ఆఫీసులలోను పనిచేయు వేలకొలది ప్రజల జీవితములు పాడగును. అందువలన క్రైస్తవ పనివాడు ఎల్లప్పుడు "అబద్ధమాడుట మాని ప్రతివాడును తన పొరుగువానితో సత్యమే మాటలాడవలెను" అని ఎఫెసీ 4:25లో వ్రాయబడి యున్నది.

క్రైస్తవ కార్మికుడు తన జీవితములో పవిత్రతను కనబరచవలెను. "కోపపడుడిగాని పాపము చేయకుడి. సూర్యుడస్తమించు వరకు మీ కోపము నిలిచియుండ కూడదు. అపవాదికి చోటియ్యకుడి, దొంగిలువాడు ఇక మీద దొంగిలక అక్కర గలవానికి పంచిపెట్టుటకు వీలుకలుగు నిమిత్తము తన చేతులతో మంచిపని చేయుచు కష్టపడవలెను. అవసరమును బట్టి క్షేమాభివృద్ధికరమైన అనూకుల వచనమే పలుకుడి గాని దుర్భాషయేదైనను మీనోట రానియ్యకుడి... సమస్తమైన ద్వేషము, కోపము, క్రోధము, అల్లరి, దూషణ, సకలమైన దుష్టత్వము మీరు విసర్జించుడి. ఒకని యెడల ఒకడు దయ గలిగి కరుణాహృదయులై క్రీస్తునందు దేవుడు మిమ్మును క్షమించిన ప్రకారము మీరును ఒకరి నొకరు క్షమించుడి" యని పరిశుద్ధాత్ముడు క్రైస్తవులను హెచ్చరించుచున్నాడు. (ఎఫెసీ 4:26-32).

**క్రైస్తవ పనివాడు తన కుటుంబ క్షేమమును పాడుచేయు శక్తులను ఎదిరించగలవాడై యుండవలెను.**

క్రైస్తవుడు తన వైవాహిక జీవితమునకు అభ్యంతరము కలుగజేయు సంగతుల నుండి లేక అలవాట్ల నుండి తొలగిపోవలెను. జారత్వమునకు గాని, అపవిత్రతకు గాని, మద్యపానమునకు గాని, ధూమ పానమునకు గాని చోటీయరాదు.

క్రైస్తవుడు తన మంచి మనస్తత్వము వలనను, ప్రవర్తన వలనను తనతో పనిచేయు ఇతరుల జీవితములను మార్చగలవాడై యుండ వలెను. "మీరు లోకమునకు ఉప్పై యున్నారు. ఉప్పు నిస్సారమైతే అది దేనివలన సారము పొందును ? ... మీరు లోకమునకు

వెలుగై యున్నారు.. మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోకమందున్న మీ తండ్రిని మహిమ పరచునట్లు వారి యెదుట మీ వెలుగు ప్రకాశింపనియ్యుడి" యని యేసు క్రైస్తవులను హెచ్చరించు చున్నారు (మత్తయి 5:13-16). దిన దినము మార్పుజెందు చున్న లోకములో మనము జీవించు చున్నాము. అయితే మన తోటివారు మనలో యున్న క్రైస్తవ మనస్తత్వమును గమనించగలిగిన యెడల, వారిని కూడ మనము క్రీస్తు లోనికి ఆకర్షించగలము. మనము యేసుతో యున్నవారముగ జీవించ వలెను. మీరు మీ పెద్దలకు లోబడి యుండుడి. "మీరందరు ఎదుటి వాని యెడల దీనమనస్సు అను వస్త్రము ధరించుకొని, మిమ్మును అలంకరించు కొనుడి. దేవుడు అహంకారులను ఎదిరించి దీనులకు కృప అనుగ్రహించును. దేవుడు తగిన సమయమందు మిమ్మును హెచ్చించు నట్లు ఆయన బలిష్ఠమైన చేతిక్రింది దీనమనస్కులై యుండుడి" యని అపో పేతురు క్రైస్తవులను హెచ్చరించు చున్నాడు. (1పేతురు 5:5-7).

ఒక చెట్టుయొక్క ఫలములు ఎట్లు దాచబడి యుండలేవో అట్లే క్రైస్తవుడు తన పనిలోను, జీవితములోను కూడ ఆత్మఫలమును కనబరచును. "అయితే ఆత్మఫలమేమనగా ప్రేమ, సంతోషము, విశ్వాసము, సాత్వికము, ఆశానిగ్రహము ఇట్టి వాటికి విరోధమైన నియమమేదియు లేదు. క్రీస్తు యేసు సంబంధులు శరీరమును దాని యిచ్ఛలతోను, దురాశలతోను సిలువవేసి యున్నారు" (గలతీ 5:22-24).

క్రైస్తవ పనివాడు తన పనిలో నిమగ్నుడై హృదయ పూర్వకముగా పనిచేయును. "దేవునియందు భయ భక్తులు కలిగి యుండి ఆయన కట్టడల ననుసరించి నడుచుచుడంవలెను. మానవ కోటికి ఇదియే విధి. గూఢమైన ప్రతిక్రియను అదిమంచిదేగాని, చెడ్డదేగాని దేవుడు తీర్పులోనికి తెచ్చును" (ప్రసంగి 12:13-14). క్రైస్తవుడు దేవునియెడల, మానవుల యెడల భయభక్తులు కలిగి పనిచేయటవలన అతడు సంతోషముతో తన కాలమును గడుపును. దేవుడు అనుగ్రహించు శ్రేష్ఠమైన యీవిని అతడు పొంది ఆనందించును.

క్రైస్తవ పనివానియొక్క బాధ్యతలు, తరుణములు ఎంతో గొప్పవి. క్రైస్తవుడు అన్నిచోట్ల అన్నివేళల క్రీస్తు కొరకు మాదిరి కరమైన జీవితమును జీవించవలెను. క్రైస్తవులు లోకమునకు వెలుగైయున్నారు. కొండమీద నుండు పట్టణము మరుగై యుండనేరదు అని యేసు బోధించెను.

మిత్రుడా, క్రీస్తు వెలుగు నీలో ప్రకాశించుచున్నదా? నీవు క్రీస్తు సువార్తకు తగినట్లుగా ప్రవర్తించు చున్నావా? నీవు పేరుమట్టుకే క్రైస్తవుడవు గాని నిజ క్రైస్తవుడవు కావా? నిన్ను నీవే ఈ రోజు పరీక్షించుకో.

# అభ్యంతరము కలిగించు రాయి

## (A Stone of stumbling)

### యెషయా 8:14 -15

**పరిచయం**

1. తనకు విధేయులైన వారికి యేసుక్రీస్తు రక్షకుడు (హెబ్రీ 5:9).

2. అదే సమయంలో ఆయనకు విధేయులు కాని వారికి ఆయన ఘోరమైన శిక్ష విధించువాడు (2 థెస్స 1:7-9).

3. మానవుల యెడల ఆయన ద్విపాత్ర పరిచర్యను వర్ణించుచు యేసుక్రీస్తు ఈ లోకమునకు రాక700 సంవత్సరముల ముందే యెషయా 8:14-15లో చెప్పబడినది.

4. అవిధేయులను శిక్షించు రాయిగాను, విధేయులైన వారిని విమోచించేవానిగాను మన రక్షకుడు రెండు నిబంధనలలోను వర్ణించ బడియున్నారు.

యెషయా 8:14-15ను మరింత విపులముగా పరిశీలించుదాము :

**ఎ.** మొదటిగా మానవ జాతికి రక్షకుని అనుగ్రహించుటకు దేవుడు ఇష్టపడుచున్నారు.

1. అప్పుడాయన మీకు పరిశుద్ధ స్థలముగా నుండును అని 13వ వచనములో చెప్పడియున్నది. అనగా ఆయన మనకొక ఆశ్రయముగా నుండును.

2. మానవునికి ఆశ్రయ దుర్గముగా నుండుటకు దేవుడు ఎల్లప్పుడు ఇష్టపడుచునే యున్నారు (సామె 18:10, కీర్తన 46:1).

3. ప్రస్తుత కాలమందు దేవుని దీర్ఘశాంతమును బట్టి ఆయన ఎవడును నశింపవలెనని ఇచ్ఛయింపక అందరు రక్షింపబడవలెనని కోరుచున్నారు (2 పేతురు 3:9-11).

**బి.** ఒక రాయి లేక పర్వతము సాధారణముగా లేఖనాల్లో దేవునికి గురుతుగా వాడబడినపదములు (దానియేలు 2:34, 35).

1. దేవుడు మానవజాతి యొక్క బండయై యున్నారు. ఆయన పై అతడు ఆధారపడ వచ్చును. ఆయన ఆశ్రయ దుర్గము (ద్వితీ 32:4,15, 18, 30-31, కీర్త 28:1, 31:2, 42:9).

2. విచారం యేమంటే దేవుని ప్రజలే తరచు ఆ బండవిషయమై అభ్యంతర పడిరి. ఆయన వారికి అడ్డు రాయియు, అడ్డు బండయు ఆయెను (1పేతురు 2:8, రోమా 9:32-33).

**సి.** పూర్వకాలపు ఇశ్రాయేలీయులకు ఆయన రక్షణ కర్తగాను ఆశ్రయ దుర్గము గాను యుండుటకు బదులు ఆయన వారికి అడ్డు బండ ఆయెను.

డి. అవిధేయులైన ఇశ్రాయేలీయుల గతి యెషయా 8:15 వర్ణించుచున్నది. వారు కాళ్లు చేతులు విరిగి పట్టుబడుదురు అని అది చెప్పుచున్నది.

1. క్రీ॥పూ 721 లో అష్షూరీయులు

ఉత్తరముననున్న ఇశ్రాయేలు రాజ్యమును ఓడించిరి. వారిలో అనేక మందిని బందీలుగా అనేక దేశములకు కొనిపోయిరి.
2. బబులోను దేశస్థులు దక్షిణముననున్న యూదా రాజ్యమును క్రీ॥పూ 587లో ఓడించిరి. వారిలో అనేక మందిని బానిసలుగా బబులోనుకు కొనిపోయిరి.
**పాత నిబంధనలోని యూదులు, మొదటి శతాబ్ధపుయూదులు దేవుని విసర్జించారు. దాని ఫలితము ననుభవించారు (యెష 28:16; మత్తయి 21:42-44).**

**ఎ.** మెస్సీయ ముఖ్యమైన మూల రాయి గాను, పునాది రాయి గాను యెషయా 28:16లో ఉదహరించబడినది
1. రాతితో కట్టబడే భవనమును గూర్చిన ఉదాహరణ ఇక్కడ వినియోగించబడినది. (1 రాజులు 5:17, 7:9, యోబు 38:6).
2. యేసుక్రీస్తును యూదులు నిరాకరించి నను ఆయన ఘన రక్షకుడు, తన రాజ్యమైన సంఘమునకు స్థాపకుడు (మత్తయి 21:42-44).
3. అపో, పౌలు కూడ యేసుక్రీస్తును ముఖ్యమైన మూలరాయిగా వర్ణించాడు (ఎఫెసీ 2:20).

**బి.** మెస్సీయ ద్వారా రాజ్యమును స్థాపించే ఏర్పాట్లు యెషయా దినములోనే ఆరభించ బడియుండెను.
1. దేవుడు అప్పటికే పునాది వేసి యుండెను. అది మెస్సీయ సంబంధమైన వాగ్దానము. అది దావీదు దినములలోనే ఆరంభించబడియుండెను. (2సమూ7:12). పునాది వేసే ప్రక్రియం క్రీస్తులో పూర్తియాయెను (మత్త21:42,44: దాకీ20:17, అపొ.కా.4:11, రోమా 9:33, ఎఫెసీ 2:20, 1పేతురు 2:4-6).
2. దేవుడు ప్రవచించగా అది నెరవేరుట తధ్యము.
3. వెయ్యి సంవత్సరముల క్రితవే వేయబడిన పునాది ఎంత పటిష్ఠమైనదో గమనించుము.

**సి.** బలహీనమైన రాతి కంటె స్థిరమైన పునాది మీద కట్టబడిన భవనము ఎప్పటి కైనా శ్రేష్టమైనదే (మత్తయి7:24-27).
1. మొదటి శతాబ్ధపు యూదులు యేసును దేవుని కుమారుడని నిరాకరించుట ద్వారా ఇసుక మీద నిర్మించుకొన్న వారుగ అగుపడుచున్నాడు. (అపో.4:11-12).
2. వారు స్థిరమైన పునాదిగాక తమ స్వంత అభిప్రాయముల పై నిర్మించుట వలన వారి మార్గము స్థిరమైనది కాకపోయెను (మత్తయి 15:9, రోమా 10:1-3).

**డి.** మెస్సీయ పరిశోధింపబడిన రాయిగా యెషయా 28:16లో వర్ణించబడినది. క్రీస్తు విషయమై అనిశ్చితియేదిలేదు.
1. క్రీస్తు రాజ్యము ఈ లోకమందు స్థిరముగా నుండును. అందులో సందేహములేదు.
2. పరిశోధింపబడిన రాయి అనగా దానిలో

చిట్లు మొ॥నవి యేమీలేని రాయి. అందువలన పునాదికి చక్కగా సరిపోయే రాయి అది.

3. యేసుక్రీస్తు సాతాను వలన, సాతాను ద్వారా పరిశోధింపబడెను. (లూకా 4:1613), మనుష్యుల వలన పరిశోధింపబడెను (లూకా 20:1-38), దేవుని వలన పరిశోధింపబడెను (మత్తయి 27:46). మానవుని విమోచనా పధకము (భవనము) యొక్క పటిష్టమైన రాయి యేసుక్రీస్తు.

**ఇ.** మన రక్షకుడు ప్రశస్తమైన మూల రాయి యని వర్ణించబడెను.

1. నిత్యరాజ్యమైన క్రీస్తు రాజ్యము సంఘము అత్యంత ప్రశస్తమైనది, విలువైనది. విలువైన రాళ్లతో పునాది వేయబడినది (ప్రకటన 21:19)

2. యేసుక్రీస్తే ఆ పునాది (1కొరింధీ 3:11).

3. దేవుని ఆత్మీయ మందిరములో నమ్మకమైన క్రైస్తవులు సజీవమైన రాళ్లని వర్ణించబడినది. (1పేతురు 2:5).

**ఎఫ్.** మెస్సీయను గూర్చి యూదులు తొట్రిల్లుటవలన అన్యజనులకు సువార్త త్వరితముగా అందజేయబడెను.

1. యూదులు తమస్వంత రక్షకునినే నిరాకరించుట వలన పౌలు అన్యజనుల యెద్దకు వెళ్ళి వారికి సువార్త చాటించెను. (అపో.కా. 13:45-48)

2. యూదులు యేసుక్రీస్తును తమ రక్షకునిగా అంగీకరించుటకు సందేహ పడినందున అన్యజనులు ఆయనను స్వీకరించుటకు వీలుపడెనని పేతురు వివరించాడు (1పేతురు 2:4-10).

**ప్రపంచములో అనేకులకు యేసుక్రీస్తు నేటికిని తొట్రిల్లు రాయిగా ఉన్నారు.**

**ఎ.** క్రైస్తవ మతము గాక యితర మతము లన్నిటికిని యేసుక్రీస్తు అడ్డుబండగాను, తొట్రిల్లు రాయిగాను యున్నారు.

1. యూదుల సాంప్రదాయము గల వారిలో పెక్కు మంది యేసుక్రీస్తు దేవుని కుమారుడని ఒప్పుకొన లేదు. అది విచారము.

2. నేటి యూదులకు ఏమైనా భక్తి యుంటే వారిని గూర్చి పౌలు యేమి చెప్పాడో దానినే వారు చేయుచున్నారు (రోమా 10:1-3).

3. యూదులలో అనేకులు నేడు భక్తి గలవారని గాక తమ పూర్వ సంప్రదాయ మును గూర్చి ఎగిరిన వారిని మాత్రమే చెప్పవచ్చును.

**బి.** క్రైస్తవ్యము గాక యితర ప్రపంచ మతములకు యేసు తొట్రిల్లు రాయిగా యున్నారు.

1. యితరమతములగు హిందూ, బౌద్ధ, ముస్లిము, సిక్కు మొ॥లగు ప్రపంచ వ్యాప్త మతములు.

2. యివన్నీ ముఖ్యముగా ఇస్లాము యితర మతములకు సవాలుగా తయారైనది.

సి. శాఖోపశాఖలుగా విపరీతముగా విభజింపబడియున్న నామినేషన్లకు యేసు తొట్రిల్లు రాయిగా యున్నారు.

2. వీటిలో ప్రతి శాఖ కూడ క్రైస్తవులమనే చెప్పుకొనుచు తమ స్వంత క్రీస్తును, విశ్వాస ప్రమాణములను, తమ స్వంత దేవుని, స్వంత సిద్ధాంతములను కలిగి యున్నారు.

**డి.** దురదృష్టావశాత్తు యేసుక్రీస్తు అనేకమంది క్రైస్తవులకు క్రీస్తు సంఘ సభ్యులకు తొట్రిల్లు రాయిగా యున్నారు.

1. మన ప్రభువు అన్ని జాతుల వారిని అంగీకరించును గనుక ఆయన కొందరికి అడ్డు రాయిగా యున్నారు (మార్కు 16:15-16).

2. యేసుక్రీస్తు వివాహము, విడాకులు, పునర్వివాహమును గూర్చి చేసిన బోధను బట్టి ఆయన కొందరికి అడ్డు రాయిగా యున్నారు (మత్తయి 19:9).

3. ఆయన మిగతా క్రైస్తవులతో కలిసి ప్రతి ఆదివారమును దేవుని ఆరాధించాలని కోరుట వలన కొందరికి అడ్డురాయిగా యున్నారు (1కొరింథీ 11:23-26, అపో.కా. 20:7, 1కొరింథీ 16:1-2).

4. ఆయన మన నుండి నీతి భక్తి యదార్థత గల జీవితము కోరుచున్నందున మరి కొందరికి అడ్డు రాయిగా యున్నారు (రోమా 12:1-2, తీతు 2:12, ఫిలిప్పీ 4:8).

5. ఆయన మన నుండి భక్తి గల పరిచర్యను కోరుచున్నందున కొందరికి అడ్డు రాయిగా యున్నారు (తీతు 2:14, యాకోబు 2:17,20,26).

6. మనము ఆయనకు విధేయులమై యుండాలని కోరుచున్నందున యేసుక్రీస్తు ఇంకా కొందరికి అడ్డు రాయిగా యున్నారు (రోమా 6:17).

**లూయిస్ రష్మోర్**

# నలుగురు మిత్రులు, ఒక రోగి

## (One sick man and Four Friends)

యేసుప్రభువు ఈ లోకంలో యున్నప్పుడు ప్రజలలో ఆయన గొప్ప ప్రఖ్యాతి గాంచారు. ఆయన మాట్లాడు చుండగా గొప్ప జనసమూహములు, పురుషులు, స్త్రీలు ఆయన చుట్టు గుమి గూడేవారు. యేసు వారికి బోధించేవారు. ఇట్టి సందర్భంలో జరిగిన ఒక సంఘటనను మనము మార్కు సువార్త 2:1-12లో చూడగలము. దాన్ని ఇప్పుడు చదువు కొందము.

"కొన్ని దినములైన పిమ్మట ఆయన మరల కపెర్నహూములోనికి వచ్చెను. ఆయన యింట ఉన్నాడని విన వచ్చినప్పుడు అనేకులు కూడివచ్చిరి గనుక వాకిటనైనను వారికి స్థలము లేకపోయెను. ఆయన

వారికి వాక్యము బోధించుచుండగా కొందరు పక్షవాయువు గల ఒక మనుష్యుని నలుగురి చేత మోయించుకొని ఆయన యొద్దకు తీసికొని వచ్చిరి. చాలామంది కూడి యున్నందున వారాయన యొద్దకు చేరలేక, ఆయన యున్నచోటికి పైగా ఇంటికప్పు విప్పి సందుచేసి పక్షవాయువు గలవానిని పరుపుతోనే దింపిరి. యేసు వారి విశ్వాసము చూచి-కుమారుడా, నీ పాపములు క్షమింపబడియున్న వని పక్షవాయువు గల వానితో చెప్పెను, శాస్త్రులలో కొందరు అక్కడ కూడియుండిరి. వారు ఇతడు ఇట్లెందుకు చెప్పుచున్నాడు? దేవదూషణ చేయు చున్నాడు గదా; దేవుడొక్కడే తప్ప పాపములను క్షమింపగల వాడెవడని తమ హృదయములో ఆలోచించుకొనిరి. వారు తమలో తాము ఈలాగున ఆలోచించు కొనుట యేసు వెంటనే తన ఆత్మలో తెలిసికొని -మీరీసంగతులు మీ హృదయములో ఎందుకు ఆలోచించు కొన్నారు? ఈ పక్షవాయువు గల వానితో నీ పాపములు క్షమింపబడి యున్నవని చెప్పుట సులభమా? నీవు లేచి నీ పరుపెత్తికొని నడువుమని చెప్పుట సులభమా? పాపములు క్షమించుటకు భూమి మీద మనుష్యకుమారునికి అధికారము కలదని మీరు తెలిసి కొనవలెనని వారితో చెప్పి పక్షవాయువు గల వానిని చూచి-నీవు లేచి నీ పరుపెత్తికొని యింటికి పొమ్మని నీతో చెప్పుచున్నాననెను. తక్షణమే వాడు లేచి పరుపెత్తికొని వారందరి యెదుట నడచి పోయెను గనుక వారందరు విభ్రాంతి నొంది, మన మీలాంటి కార్యములను ఎన్నడును చూడలేదని చెప్పుకొనుచు దేవుని మహిమపరచిరి".

యేసుప్రభువు ఈ మహత్కార్యము చేసినప్పుడు అక్కడున్న ప్రజలందరిని అట్లుంచి, పక్షవాయువు రోగముగల వానిని మోసుకొని వచ్చిన నలుగురిలో ఆయనకు బహుశ కనబడి లక్షణములును కొన్నింటిని మనము చూద్దాం. వారికున్న ఈ లక్షణాలను ఆయన గమనించి హర్షించి యుంటారు.

ఒకని అవసరాన్ని గ్రహించిన నలుగురి మనుష్యులను ఆయన అక్కడ చూచారు. రోగియైన వాడు వారి మిత్రుడు. అతని అవసరాన్ని గూర్చి వారు గ్రుడ్డివారు కారు. అతనికి సహాయం చేయదానికి ముందుకు వచ్చారు. మంచి సమరయుని కథనంలో మనమొక యాజకుని ఒక లేవీయుని కనుగొంటాము. దొంగల చేతులలో చిక్కి కొట్టబడి కొరప్రాణముతో యున్న వానినొకని వారు కనుగొనినను, అతని కేమీ సహాయపడకుండా తమ త్రోవను వెళ్లిపోయారు. ఈ నలుగురు మిత్రులైతే అట్టివారు కారు; మంచి సమరయుని వలె ఆపదలో నున్న వానికి సహాయ పడుటకు వారు ముందుకు వచ్చారు.

మనము ఒండొరుల అవసరాలను తీర్చుడానికి ఎల్లప్పుడు ప్రయత్నించాలి. "మనమట్లు సహాయపడితే, మిక్కిలి అల్పులైన యీ నా సహోదరులలో ఒకనికి మీరు చేసితిరి గనుక నాకు చేసితిరని నిశ్చయముగా మీతో చెప్పు చున్నాను" అని అంత్యతీర్పులో ప్రభువు మనతో చెప్పును (మత్త 25:31–43 వరకు చదవండి). మన పొరుగువాని అవసరాలలో మనము సహాయపడు విధానాన్ని బట్టి దేవుని యెడల మనకున్న ప్రేమ యెట్టిదో వ్యక్తపరచబడతాది. అందుకే, "ఈలోక జీవనోపాధి గలవాడై యుండి తన సహోదరునికి లేమి కలుగుట చూచి అతని యెడల ఎంత మాత్రమును కనికరము చూపని వాని యందు దేవుని ప్రేమ యేలాగు నిలుచును?" అని యోహాను ప్రశ్నించుచున్నాడు (1యోహాను 3:17)

**తరువాత వారిలో, ప్రయత్నించిన నలుగురి మనుష్యులను యేసుప్రభువు చూచారు.** వారికి బదులు ఇంకెవరో ప్రయత్నించే వరకు వారు కనిపెట్టలేదు. "దినములు చెడ్డవి గనుక మీరు సమయమును పోనియ్యక సద్వి నియోగము చేసికొనుచు, అజ్ఞానుల వలెకాక జ్ఞానులవలె నడుచుకొనునట్లు జాగ్రత్తగా చూచుకొనుడి" యని మనకు ఉపదేశించబడింది (ఎఫెసీ 5:15,16). 'అలసించిన ఆశాభంగము' అనే తెలుగు సామెత ఒకటి యున్నది. ఈ నలుగురు మిత్రులు తమకు దొరికిన తరుణాన్ని సమయాన్ని పోనిచ్చిన యెడల ప్రభువు మరల వారికి బహుళ దొరుకకపోవును, వారి మిత్రుడింకా రోగియై యుండును. మనము ప్రభువు కొరకు ప్రయత్నించిన యెడల ఆయన తప్పక సహాయం చేస్తారు. "నన్ను బలపరచు వానియందే నేను సమస్తమును చేయగలను" అని అందుకే పౌలు చెప్పగలిగాడు (ఫిలిప్పీ 4:13). వారు ప్రయత్నించారు, ప్రభువు స్వస్థపర్చారు.

**పక్షవాయువు గలవానిని ఆయన యొద్దకు మోసికొని వచ్చిన ఆ నలుగురు కలిసి పనిచేసినట్లు యేసుప్రభువు చూచారు.** ఆ నలుగురు అతన్ని మోసేటప్పుడు వారిలో వారు పోట్లాడుకొంటే, అతడు తన రోగముతోనే ఉండి యుండేవాడు. అయితే మనందరం ఐక్యత కలిగి యుండాలని దేవుడు కోరుచున్నారు. పాపులను క్రీస్తు నొద్దకు తెచ్చుటలో నేటి క్రైస్తవులు ఘోరంగా విఫలమయ్యారు. ఎందువలన? వారిలో ఒకొరికి ఒకరు పడదు; వేర్వేరు సంఘాలుగా విడిపోయి ఐక్యత కలుగాలంటే అదెట్లు సాధ్యమౌతాది? "సహోదరులు ఐక్యత కలిగి నివసించుట ఎంత మేలు! ఎంత మనోహరము!" (కీర్తన 133:1) క్రీస్తు నామము ధరించిన వారందరు ఒకే శరీరములో యుండి ఏకమై యుండాలని ఆయన కోరుచున్నారు. "అందరును ఒక్క

భావముతో సువార్త విశ్వాస పక్షమున పోరాడుచు ఏకమనస్సు గలవారై నిలిచి యున్నారని నేను మిమ్మును గూర్చి వినులాగున మీరు క్రీస్తు సువార్తకు తగినట్లుగా ప్రవర్తించుడి" యని పరిశు ద్ధాత్మ ద్వారా పౌలు చెప్పుచున్నాడు (ఫిలిప్పీ 1:28). మానవ శరీరములో యున్న అవయవములన్నీ ఒకదానితో ఒకటి ఎట్లు కలిసి పనిచేస్తాయో, అట్లే సంఘములో యున్న ప్రతివారు కలిసి పనిచేయాలి. ఇట్టి ఐక్యత దేవునికి ప్రీతికరమైనది (1కొరింథి 12, ఎఫెసీ4)

చివరిగా క్రీస్తును పంచుకోవడానికి ఆస్తికి గలిగిన వారిని ఆ నలుగురిలో యేసుప్రభువు చూచారు. అంద్రెయ మొదట యేసును కనుగొనినప్పుడు "అతడు మొదట తన సహోదరుడైన సీమోనును చూచి, మేము మెస్సీయను కనుగొంటిమని అతనితో చెప్పి యేసునొద్దకు అతని తోడుకొని వచ్చాడు" (యెహాను 1:41). పక్షవాయువు గలవానిని తన నలుగురు మిత్రులు క్రీస్తునొద్దకు తీసికొని వచ్చారు. ఆయన అతని స్వస్థపరిచారు. ఈలోకంలో అనేక మిత్రులు మనకుండవచ్చును. మనం వారిని క్రీస్తునొద్దకు తీసికొని వచ్చే వరకు వారికి ఆత్మీయ స్వస్థత లభించదు. మనం యేసుప్రభువునందు ప్రగాఢమైన విశ్వాసముంచాలి. ఆయన గూర్చి ఇతరులకు చెప్పాలి. అపో.పౌలు ఇట్లును చున్నాడు. "విశ్వసించితిని గనుక మాటాలాడితిని అని వ్రాయబడిన ప్రకారము అట్టి విశ్వాసముతో కూడిన ఆత్మ గలవారమై ప్రభువైన యేసును లేపిన వాడు యేసుతోమిమ్మును కూడ లేపి మీతో కూడ తన యెదుట నిలుబెట్టునని యెరిగి, మేమును విశ్వసించుచున్నాము. గనుక మాటలాడుచున్నాను. (2కొరింథీ 4:14, 15). అపొస్తులులు బెదిరించ బడినను, హింసంచబడినను సరే మేము క్రీస్తును గూర్చి విన్నవాటిని, కన్నవాటిని చెప్పలేక యుండలేమన్నారు. (అపో.కా. 4:18-20) ఇతరుల యెడల ఆసక్తి కలిగి, శక్తి కొలది ప్రయత్నిస్తూ, ఐక్యత కలిగి మనం క్రీస్తును గూర్చి ఈలోకానికి ప్రకటిస్తే వారు తప్పక క్రీస్తు శిష్యులవుతారు. ఈ రోజు కూడ ఆయన నీపాపరోగాన్ని బాగు చేయగలడు. యేసునందు విశ్వాస ముంచుము, నీపాపముల విషయమై మారుమనస్సు పొందుము, పాపక్షమాపణ నిమిత్తం ఈరోజే బాప్తిస్మము పొందుము. ప్రభువు నీకు తప్పక సహాయం చేస్తారు. (మార్కు 16:16, అపో.కా 2:38)

**జాషువా గూటం**

# ఆసక్తి జనకమైన బైబిలు వాస్తవములు

## (Interesting Facts about the Bible)

బైబిలును 40 మంది 1600 సంవత్సరముల కాలములో అనగా క్రీపూ. 1503 నుండి క్రీ.శ 100వ సంవత్సరము వరకు వ్రాయుటలో నిమగ్నులైయుండిరి. ఈ మనుష్యులు పరిశుద్ధాత్మ వలన ప్రేరేపించబడినవారై వ్రాసిరి (2పేతురు 1:21). వారు మనుష్య జ్ఞానము నేర్పు మాటలతో గాక ఆత్మనేర్పు మాటలతో వ్రాసిరి (1కొరింథీ 2:13).

బైబిలులో వెుుత్తము 66 పుస్తకములు 1189 అధ్యాయములు, 31, 102 వచనములు ఉన్నవి. ఇంగ్లీషు బైబిలు నందు 35,66,480 అక్షరములు, 7,73,746 మాటలు ఉన్నవి. పాత నిబంధనలో 39 క్రొత్తనిబంధనలో 27 పుస్తకములు ఉన్నవి. బైబిలు నందున్న ప్రతిమాటలోను సగటున అయిదు అక్షరములున్నవి. పెద్ద పెద్ద మాటలను వినియోగింప ప్రయత్నించు వానికి ఇది ఒక గొప్ప పాఠము.

'యెహోవా' అనుపదము 6,855 సార్లును. 'ప్రభువు' అనుపదము 1853 సార్లును అగుపడును.

ఇంగ్లీషు బైబిలులో **'And'** అను పదము 46,277 సార్లు కనబడును, రెవరెండ్ అను మాట ఒకేసారి కనబడును (కీర్తన 111:9).

ఎస్తేరు గ్రంధములో 10 అధ్యాయములున్నవి. గాని ప్రభువు అను పదము గాని దేవుడు అనుపదము గాని అందులో కన్పించదు.

బైబిలు అంతటలోను చిన్నదియు, మధ్యగాయున్నట్టియునగు అధ్యాయము 117వ దా. కీర్తన. అందులో కేవలము రెండు వచనములు మాత్రమే యున్నవి. బైబిలులోని మధ్యవచనము కీర్తన 118:8. యోబు 29వ అధ్యాయము పాత నిబంధనలో మధ్య అధ్యాయము. 2వ దిన వృత్తాంతములు 20:13 పాతనిబంధనలో మధ్యవచనము.

1 దినవృత్తాంతము 1:25 పాత నిబంధనలో బహుచిన్న వచనము. అయితే ఎస్తేరు 8:9 అందున్న పెద్ద వచనము.

క్రొత్త నిబంధనలో మధ్యనున్న పుస్తకము 2 థెస్సలో నీకయులకు వ్రాయబడిన పత్రిక. రోమా 13,14 అధ్యాయముల మధ్య క్రొత్త నిబంధనలో మధ్యనున్న అధ్యాయమున్నది. అపొ.కా. 17:17 క్రొత్త నిబంధనలో మధ్యవచనము. క్రొత్త నిబంధనలోను, బైబిలు అంతటిలోను బహుచిన్న వచనము యోహాను 11:35.

బైబిలులో పెద్ద వచనము యెషయా 18:1లో కన్పడును, 2వ రాజులు 19వ అధ్యాయము, యెషయా 37వ అధ్యాయము ఇంచుమించు ఒకే రీతిగ యున్నది.

బైబిలు మొట్టమొదటిగా అచ్చు వేయబడిన గ్రంథము. అది 1450లో అచ్చు వేయబడెను. ఇండియాలో 1806లో హిందీలో లేఖనములు కొన్ని మొదటిసారిగా ముద్రింపబడెను. 1811లో మొదటి క్రొత్త నిబంధన 1835 లో బైబిలు అంతయును హిందీ భాషలో ముద్రింపబడెను. హిందూస్థానీలోనికి తర్జుమా చేయబడిన మొదటి క్రొత్త నిబంధన 1900లో ముద్రింపబడెను. ఇండియాలో 1806లో హిందీలో లేఖనములు కొన్ని మొదటిసారిగా ముద్రింపబడెను. 1811లో మొదటి క్రొత్త నిబంధన 1835లో బైబిలు అంతయును హిందీభావలో ముద్రింపబడెను. హిందూస్థానిలోనికి తర్జుమా చేయబడిన మొదటి క్రొత్త నిబంధన 1900లో ముద్రింపబడెను.

1727లో తమిళంలో మొదటిగా బైబిలు ముద్రింపబడెను. 1854లో అది తెలుగులో అచ్చువేయబడెను.

1814లో ఉర్దూలో క్రొత్తనిబంధనలో మొదట ముద్రింపబడెను. 1843లో బైబిలు అంతయు ఉర్దూలో ముద్రింపబడెను.

విల్లియం కేరీ, హెన్రీ మార్టిన్, విలియం బౌలీ, తామస్ కోల్ బ్రూక్ అనువారలు మొదటి తర్జుమాదారులలో కొందరు.

1971లో 80,72,000 మందికి బైబిళ్ళు, క్రొత్త నిబంధనలు, వాక్య భాగములు హిందూ దేశములో అంద జేయబడెనని బైబిలు సొసైటీ ఆఫ్ ఇండియా వారు తెలియజేసిరి.

గత కొద్ది సంవత్సరములలోను బైబిలు నాలుగు క్రొత్త భాషలలోనికిని, క్రొత్త నిబంధన రెండు భాషలలోనికిని, వాక్యభాగములు 15 భాషలులోనికిని తర్జుమా చేయబడెను. వాటితో కలిపి భారతదేశములో బైబిలు 37 భాషలలోనికి క్రొత్తనిబంధన 24 భాషలలోనికి, వాక్యభాగములు 87 భాషలలోనికి తర్జుమా చేయబడెను.

ఆంగ్లములో **King James Version** బైబిలు 1611లో మొదట ప్రచురింప బడెను. 1855లో **Revised Version** తయారు చేయబడెను.

కార్డినల్ హ్యూగో అనునతడు బైబిలును అధ్యాయములుగా విభజించెను. సర్ రాబర్ట్ స్టీవెన్స్ అనునతడు క్రొత్త నిబంధనను వచనములుగ 1551లో విభజించెను.

అధ్యాయములు గాను,వచనములు గాను విభజింపబడిన మొత్తము బైబిలు అంతయు 1560లో తయారయ్యెను.

దానిని 'జెనీవా బైబిలు' అని పిలుచుటకద్దు. సవరణోద్యమకారులచే (Reformers) అది జెనీవాలో తయారుచేయబడెను గనుక దానిని అట్లు పిలిచిరి.

ప్రపంచములో పెక్కు భాషలలోనికి తర్జుమా చేయబడిన గ్రంథము బైబిలు. మరియే గ్రంథము కూడ అన్ని భాషల లోనికి ఎన్నడును తర్జుమా చేయబడి యుండలేదు. ప్రపంచమందతటా బైబిలు గ్రంథమే ఎక్కువ అమ్ముడగుచున్న గ్రంథము.

మానవుని ఉద్భవమును గూర్చి, అతని గతిని గూర్చి తెలియజేయు గ్రంథము అది ఒక్కటి మాత్రమే. రక్షణను గూర్చి అది ఒక పాఠ్యపుస్తకమై యున్నది.

బైబిలునకు విజ్ఞాన శాస్త్రవాస్తవము లకును మధ్య విభేదములు ఏమియును లేవు. బైబిలునకుకు శాస్త్రజ్ఞులమని చెప్పుకొను వారి సిద్ధాంతములకును, విభేదములుండవచ్చును.

అన్నిటికంటె పైగా బైబిలును చదివి, దానికి విధేయత చూపించవలెను. దానిని బోధించవలెను. జె.సి. ఛోట్

## "నేను మరిచిపోను"
## ( I will not Forget)

మనం గుర్తుంచుకొనవలసిన సంగతులను ఎన్నిసార్లు మరిచిపోతాము? అనేకులు దేవునికి తమ కుటుంబమునకును యున్న విధిని మరచిపోవుదురు. "నేను మరిచిపోను" అని చెప్పినప్పుడు అందులో కృత నిశ్చయతయున్నది. దేనినైనా సాధించడానికి దృఢసంకల్పము లేకపోతే ఎవడు యేమీ సాధించలేడు.

మనం మరచిపోవలసిన కొన్ని సంగతులున్నాయి. "వెనుకనున్నవి మరచి ముందున్న వాటి కొరకై వేగిరి పడుచు..."అని అపొ.పౌలు వ్రాసాడు (ఫీలిప్పి 3:13-14). దావీదు తన భావాన్ని ఈలాగు చెప్పుచున్నాడు.

1. "నీ కట్టడలను బట్టి నేను హర్షించెదను, నీ వాక్యమును మరువక యుందును" అని దావీదు చెప్పాడు (కీర్తన 119:6). మానవ కల్పిత బోధలను, సిద్ధాంతములను మనం మరచిపోవాలిగాని దేవుని వాక్యము మాత్రము మరచిపోరాదు (మత్తయి 15:1-9, హెబ్రీ 4:12).

2. "నేను పొగ తగులుచున్న సిద్దెవలె నైతిని. అయినను నీకట్టడలను నేను మరుచుట లేదు" (కీర్తన 119:83). కట్టడలనగా దేవుడిచ్చిన ఆజ్ఞలు. మోషే ధర్మశాస్త్రము అమలులో యున్నంత కాలము యూదులకు అది వర్తించెను. గాని దానిని యేసుక్రీస్తు నెరవేర్చెసారు. ఆయన సిలువపై మరణించినప్పుడు దానిని తొలగించి క్రొత్త నిబంధనను గ్రహించారు. (మత్తయి 5:17-18, లూకా 2:44-49, కొలస్స 2:14-17)

3. నా ప్రాణము ఎల్లప్పుడు నా అరచేతిలో ఉన్నది. అయినన్ను నీ ధర్మశాస్త్రమును నేనుమరువను (కీర్తన 115:109), క్రొత్త నిబంధన దేవుని ధర్మశాస్త్రమైయున్నది. (రోమా 8:1-2; యాకోబు 1:25; 2:12). క్రైస్తవులు మోషే ధర్మశాస్త్రము క్రిందలేరు.

4. "నేను అల్పుడను నిరాకరింపబడిన వాడను. అయినను నీ ఉపదేశములను నేను మరువను" (కీర్తన 119-141). నామకార్ధ క్రైస్తవునిగా యుంటే సరిపోదు. యధార్ధముగా ఒకడు క్రైస్తవ జీవితము జీవించాలి. దేవుని వాక్యము అందుకు సహాయపడును.

5. "తప్పిపోయిన గొర్రెవలె నేను త్రోవ విడిచి తిరిగితిని, నీ సేవకుని, వెదకి పట్టుకొనుము. ఎందుకనగా నేను నీ ఆజ్ఞలను మరచువాడను కాను"(కీర్తన 119:176). దేవుని బిడ్డయైన వాడు తొలగిపోతే అతడు దేవుని వాక్యమును మరువని వాడైతే తప్పక దేవుని యొద్దకు తిరిగివచ్చును. అయితే దేవుని బిడ్డయైన వాడు వాక్యము నెరిగియు తిరిగిరాకపోతే నిత్యము నశించును (గలతీ 5:4, 1కొరింధీ 9:27, 10:12, లూకా 8:13, హెబ్రీ 4:4-6, 10:25-30).

గొర్రెలు కూడ త్రోవ తొలగిపోవును. వాటిని కనుగొనకపోతే అవి నశించును. (మత్తయి 12:6, లూకా 15:1-7, మత్తయి 15:24).

6. "నా ప్రాణమా యెహోవాను సన్నుతించుము. ఆయన చేసిన ఉప కారములలో దేనిని మరువకుము" (కీర్తన103:3). మనదేవుడు మనలను సమృద్ధిగా దీవించారు. ఆయనచేసిన ఉప కారముల కొరకు నిత్యము కృతజ్ఞత కలిగియుందము, ఆయన నామమును, ఔన్నత్యమును మరువకయుందము.

**డబ్ల్యు.ఎ. హోలీ**

# ఏ భేదమును లేదు

## (There is no difference)

యూదులు, అన్యులను ఉద్దేశించి పౌలు మాట్లాడుతూ ఏ భేదము లేదు అందరూ పాపము చేసి దేవుడనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారని రోమా 3:23లో పేర్కొన్నాడు. మానవ జాతికి సంబంధించిన అనేక విషయాల్లో కొన్ని భేదాలుంటాయి. మరి కొన్నిట్లో సారూప్యత ఉంటుంది. దు:ఖంలో వున్న వారి విషయంలో సానుభూతి చూపించుట లోను కష్టాల్లో వున్న వారికి సహాయం చేయుటలోను తేడాలుండక పోవచ్చు అయితే రక్షణ వెదకు చున్నవారికి సహాయ పడుటలో కూడా ఎటువంటి తేడా లేదు.

### వర్ణ భేదము లేదు

మొదటిగా మానవజాతికి భౌతిక అవసరతలు తీర్చుటలో ఏవిధమైన భేదములు ఉండవు. ధనికుడైనా, పేదవాడైనా,

నల్లగావున్నా, తెల్లగావున్నా, జ్ఞానియైనా, బుద్ధిహీనుడైనా, ముసలివాడైనా, పడుచువాడైనా, భారతీయుడైనా, ఆఫ్రికా, అమెరికా వానియైన మనందరికీ సంతోషము, దు:ఖము, ఆశ, నిరాశ, ధైర్యం, పిరికితనం, ప్రేమ, ద్వేషం అనేవి సహజం. అయితే అవి అందరికీ సమానము కావు.

### పాప భేదము లేదు

రెండవదిగా పాపము విషయంలో లెక్క అప్పగించడంలో వ్యక్తుల మధ్యతేడా లేదు. అందరునూ పాపము చేసి దేవుడను గ్రహించు మహిమను పొందలేక పోవు చున్నారు.(రోమా 3:23). మానవ జాతికంతకూ క్రీస్తు రక్షకుడనే ఆవస్యకత ఉంది. పాపము పాపమే అందులో తేడాలేదు. అది మన నాశనమునకు హేతువని అనేక పర్యాయములు మనంవింటున్నాం. ఇది యదార్థము. ఏ పాపమైనా అతడు పశ్చాత్తాపపడి పాపక్షమాపణ పొందక పోతే అది అతని ఆత్మను నశింప చేస్తుంది. అందులో మరోమాటకు తావు లేదు. పాపంలో రకాలు, వాటికి కొలతలు వుంటాయనేది యదార్థం కాదు. నాది చిన్న పాపము నీది పెద్దపాపము అని లెక్కించే వీలులేదు. మనుష్యులు ఇలా ప్రార్థించడం మనం వింటుంటాం. 'ప్రభువా పాపములో నశించు వారిని రక్షించు. మాటతప్పిదాన్ని, అపరాధాన్ని మన్నించు; అనగా నీవు పాపము చేశావని నేను తప్పులు అపరాధాలు చేశానని కాదు.

బైబిలు బాగా చదివితే పాపము లోని తేడాలు కనబడతాయి. యేసు పిలాతుతో మాట్లాడుతూ నన్ను నీకు అప్పగించిన వానికి ఎక్కువ పాపము కలదు (యోహాను 19:11) అన్నారు.

మత్తయి 21:31లో సుంకరులును, వేశ్యలును మీకంటే దేవుని రాజ్యములో ముందుగా ప్రవేశింతురని యేసు చెప్పిన మాట దీనిని సూచించుచున్నది. కొన్ని సందర్భాలలో తామే నీతిమంతులమని తలంచేవారు వేశ్యల కంటే పాపులని దేవుని వాక్యం చెబుతుంది. తన యజమానుని చిత్తమెరిగి యుండియు, సిద్ధపడకయు, అతని చిత్తము చొప్పున జరిగింపకయు వుండు దానునికి అనేకమైన దెబ్బలు తగులును (మత్తయి 12:47). మత్తయి 12:38-40లో విమర్శ దినము గూర్చి ఆయన తెలియ చేస్తున్నారు. ఈభాగంలోని ముఖ్యాంశ మేదనగా ప్రతివ్యక్తి యొక్క పాపములను గూర్చి ఏ విధమైన భేదమును లేదు. ఆ పాపం పెద్దగా లేక చిన్నగా అనిపించినా పాపము పాపమే. మనము ఆయన పవిత్ర రక్తం ద్వారా శుద్ధీకరింపబడే వరకూ మనం రక్షణ పొందలేము. మనం ఆయనను అంగీకరించి ఆయన కృప ద్వారా రక్షణపొందవలెను.

మూడవదిగా దేవుడు మనందరి ఎడల చూపుతున్న ప్రేమలో బేధముండదు.

మనలను వివిధ రీతిలో ప్రేమించుచుండవచ్చు. నీ పాపము ఎంత పెద్దదైన ఆయన నిన్ను ప్రేమిస్తున్నారు. నీవు రక్షించబడాలని కోరుకుంటున్నారు. అది ఇప్పటికి నా ఊహకు అందని యదార్థత, దేవుడు మనలను ఎంతగా ప్రేమించినా మనం పశ్చాత్తాపపడి ఆయన మార్గమునకు మళ్ళకుంటే మనకు రక్షణ దొరకదు. అది ఆయన నియమించిన మార్గమై యుండాలి.

వారి అవివేక హృదయము అంధకారమాయెను. తాము జ్ఞానులమని చెప్పుకొనుచు బుద్ధిహీనులైరి (రోమా 1:22) అని దేవుని వాక్యం చెబుతుంది. కొందరు ఆలస్యమని ఎంచుకొనునట్లు ప్రభువు తన వాగ్ధానమును గూర్చి ఆలస్యము చేయువాడు కాడు గాని ఎవడును నశింప వలెనని యిచ్ఛయింపక అందరూ మారుమనస్సు పొందవలెనని కోరుచూ మీ ఎడల దీర్ఘశాంతము గలవాడై యున్నారు. (2 పేతురు 3:9).

నాలుగవదిగా రక్షణ విషయములో క్రీస్తు పధకము నందు ఏ బేధము లేదు. నేనే మార్గమును, సత్యమును, జీవమునై యున్నాను. నా ద్వారా తప్ప ఎవడును తండ్రి యొద్దకు రాడు (యోహాను 4:16) అని యేసు చెప్పి యున్నారు. ఆయన దీనికి ప్రత్యామ్నాయమేమి ఇవ్వలేదు. నేను ఆయనని మీరు విశ్వసించని ఎడల మీరు పాపములోనే యుండి చనిపోవుదురు (యోహాను 8:24) అని యేసు చెప్పారు. మీరు మారుమనస్సు పొందని యెడల మీరందరు అలాగే నశింతురు (లూకా 13:3) . ఒకడు రక్షణ పొందాలంటే నోటితో ఒప్పుకోవాలనేది ఇప్పటికీ యదార్ధమే 'బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించుచున్నది". (1పేతురు 3:21). అది ఇప్పటికీ నిలకడైన నిజం. నీవు ఇప్పటికీ ఈ కార్యాలు చేయకపోతే నీవు రక్షణ పొందలేదని తెలుసుకో, గుర్తుంచుకో!

**టి. పెర్సి బ్రౌన్**

## యేసును గూర్చిన చారిత్రక ఋజువు

## (Historical Evidence of Jesus)

థాల్లస్ అనే సమరయ జాతికి చెందిన చరిత్రకారుడు సుమారు క్రీస్తు శకం 52లో 'రోమును' గూర్చి వ్రాశాడు. అతను వ్రాసిన ప్రతులు పూర్తిగా ప్రస్తుత కాలంలో లభించడంలేదు కానీ కొన్ని అంశాలు చెలామణిలో వున్నాయి. రెండో శతాబ్ధంలో జీవించిన జూలియస్ ఆఫ్రికానస్ థాలస్ రచనలలోని అంశాలను ప్రస్తావిస్తూ సూర్యుడు మరుగైన చీకటి సందర్భాన్ని థాల్లస్ తన చరిత్రల పుస్తకంలో పేర్కొన్నట్లు రాశాడు.

ఈ చీకటి యేసుక్రీస్తు సిలువలో వ్రేలాడిన మూడు గంటల సమయంలో లోకమంతా చీకటి కమ్ముకోడాన్ని తెలియజేస్తుంది. మధ్యాహ్నము మొదలుకొని మూడగంటల వరకు ఆదేశమంతటను చీకటి కమ్మెను (మత్తయి 27:45 మార్కు 15:33 చూడుము). ఆ చీకటిని థాల్లస్ సూపర్ నేచురల్ ఈవెంట్ అస్వభావికంగా కాక ప్రకృతి సిద్ధంగా సూర్యునికి,

భూమికి మధ్య చంద్రుడు వచ్చినప్పుడు ఏర్పడే సూర్యగ్రహణంగా అతను పేర్కొన్నాడు. కానీ ఆఫ్రికానస్ దాని గూర్చి వివరిస్తూ ఆ చీకిటి సూర్యగ్రహణం కాదని, ఎందుకంటే సూర్యగ్రహణం రోజున పూర్తిగా చంద్రుడు కనిపించడం తటస్థించదని రాశాడు. యేసు పస్కా పండగ రోజున సిలువ వేయబడెనని ఆ రోజు పౌర్ణమి అయినందున చంద్రుడు పూర్తిగా కనిపించాడని తన పరిశీలనలో పేర్కొన్నాడు.

థాల్లస్ క్రైస్తవ్యానికి వ్యతిరేకి. యేసుక్రీస్తు దేవుని కుమారుడన్న విషయాన్ని తాను నమ్మలేదు. ఏదైనా, ఆ చీకటిని గూర్చి వివరిస్తూ ఆ చీకటి యేసు సిలువ మరణమప్పుడు సంభవించిందని నిర్ధారించాడు. థాల్లస్ ఆ చీకటి కారణాన్ని గూర్చి మాత్రమే వాదించాడు గాని దాని వెనుక వున్న సత్యాన్ని గురించి తెలుసుకో లేకపోయాడు. కాబట్టి క్రీ॥శ॥ 52లోని రాతల వల్ల ఈ చరిత్ర కారుని పరిశీలనలో బైబిల్‌లోని మూడు చారిత్రకాంశాలు సత్యములని నిర్ధారణ అయ్యింది. 1. యేసు మాయా రూపం కాక నిజమైన వ్యక్తి అని 2. ఆ యేసు సిలువ వేయబడ్డాడని 3. యేసు సిలువ వేయబడినప్పుడు చీకటి కమ్మిందని ఋజువయ్యింది.

నజరేయుడైన యేసు ఒక పురాణకథ కాదు. మానవ చరిత్రకారులు యేసు నిజమైన వ్యక్తి అని ఆయన నేల పై నడిచాడని నిర్ధారించారు. క్రొత్త నిబంధన నజరేయుడైన యేసును గూర్చిన సత్యములతో పాటుగా ఆయన దైవిక వ్యక్తిత్వాన్ని వెల్లడి చేస్తుంది. ఈ పేజీల్లోని విషయం యేసుక్రీస్తు దేవుని కుమారుడని (యోహాను 20:31) మనకు సాక్ష్యమిస్తుంది.

**రాయ్‌స్ ఫ్రెడరిక్**

# దేవుడే మానవునిగా వచ్చినట్లయితే

## (If God became a man)

దేవుడు మానవునిగా వచ్చినట్లయితే ఆయన నుంచి అద్భుతాలు, మహత్కార్యాలను మనం ఆశిస్తాం. యేసు చేసిన అద్భుతాలు ఈ విషయాన్ని ఋజువు చేస్తున్నాయి.

దేవుడు మానవరూపంలో వస్తే ప్రేమను ఆయన నుండి ఆశిస్తాం. క్రీస్తు చూపిన నిస్వార్థ ప్రేమ దీనిని ఋజువు చేస్తుంది. ఆయన పాపులను, గురికి చెదరిన వారిని, పశ్చాతాప్తులను, హీనులను, దీనులను అక్కున చేర్చుకున్నారు. ఆయన తన అత్యున్నత ప్రేమను సిలువ మ్రానుపై కనుపరచారు.

దేవుడే మానవునిగా వస్తే సత్యవంతుడైన వ్యక్తిత్వాన్ని ఆయన నుంచి ఆశిద్దాం. ఏది సత్యమో మానవుడు ఎలావుండాలో దేవుడు చూపుతాడు ఆయన మనమెలా వుండాలో చెబుతాడు. యేసు

తన వ్యక్తిత్వం దైవికమైనదనీ మహాగొప్ప ఋజువులను మన ముందుచారు.

క్రైస్తవ్యం క్రీస్తు చేసిన అద్భుతాల ద్వారా పరీక్షింపబడగలదని నేను నమ్ముతాను. అద్భుతాలు లేకుండా కొత్త నిబంధనను నమ్మగలమా? అద్భుతాలు క్రీస్తు బోధనలను బలపరిచాయి. తన దైవత్వపు నిరూపణకోసం యేసు అద్భుతాలను చేశారు (యోహాను 10:24, 37, 38; లూకా 7:20-22). ఈ అద్భుతాలు చారిత్రక వెలుగులో చేయబడ్డాయి. చాలా అద్భుతాలను బహిరంగంగా ఆయన చేశారు. చాలా అద్భుతాలు ఆయన అవిశ్వాసులలో విశ్వాసం పాదుకొల్పడానికి చేశారు. అన్ని రకాల స్వస్థతలు జరిగాయి. స్వస్థత పొందిన వారి సాక్ష్యాలు కావలిసినన్ని ఉన్నాయి. ఆయన చేసిన అద్భుతాల విషయమై విరుద్ధమైన భావన లేదు.

క్రీస్తు మృతులలో నుండి లేవడం ద్వారా క్రైస్తవ్యం పరీక్షింపబడిందని నేను నమ్ముతాను. పునరుత్థానము గొప్ప అద్భుతం. అవిశ్వాసుల అభిప్రాయములను పటాపంచలు చేయడానికి చారిత్రక కాలాన్ని వివరించడానికి , ఈ అద్భుతాన్ని విడిచిపెట్టే అవకాశంలేదు. అంతేకాక ఆయన మృతులలో నుంచి లేచిన తరువాత పలు సందర్భాలలో ఆయనను చూసిన వందలాది మంది సంగతేంటి? (1కొరింథీ 15) సాక్ష్యము స్థిరమైనది మరియు క్రీస్తు యందు విశ్వాసము నిశ్చలమైనది.

మేక్కపీటర్సన్

# వెయ్యేండ్ల పాలన ఎక్కడిది - మానవునిదా ? దేవునిదా ?

## (Premillenialism from Man or God?)

క్రీస్తు శకము మొదటి శతాబ్ధములో తన రాజ్యమును స్థాపించుటకు దేవుడు సంకల్పించాడు (దాని. 2:44). ఆ రాజ్యాన్ని స్థాపించడానికి క్రీస్తు మొదటి శతాబ్ధములో వచ్చారు (మార్కు 9:1). "నీవు రాజువా?" అని పిలాతు యేసు నడిగాడు. యేసు "నీవన్నట్టు నేను రాజునే, సత్యమును గూర్చి సాక్ష్యమిచ్చుటకు నేను పుట్టితిని, ఇందు నిమిత్తమే యీ లోకమునకు వచ్చితిని" అని చెప్పారు (యోహాను 18:37). ఆయన ఏమి చేయడానికి వచ్చారో దాన్ని సాధించారు. దేవునికి ప్రార్థిస్తూ 'చేయుటకు నీవు నా కిచ్చిన పని నేను సంపూర్ణముగా నెరవేర్చితినని'' ఆయన వలికారు (యోహాను 17:4). ఎవడైన దేవుని రాజ్యము స్థాపించబడిందనే వాస్తవాన్ని అంగీకరించడానికిది చాలును. అయినను రాజ్యము భావిలో ఎప్పుడో స్థాపించుబడునని ఎదురు చూచే వారున్నారు! వారు వెయ్యేండ్ల పాలన వాదులు. అయితే క్రీస్తు భూమి మీద

వెయ్యేండ్ల మట్టుకు పాలన చేయునని చెప్పే లేఖనభాగమేమి లేదని గ్రహించుకోవాలి. రాజ్యము స్థాపింపబడక ముందు రెండు ప్రాముఖ్య సంగతులు జరుగునని వెయ్యేండ్ల పాలనా వాదులు ఎదురు చూచుచున్నారు; అవి ఎత్తబడుట మరియు మహాశ్రమల కాలము.

### వెయ్యేండ్ల పాలనావాదులు చెప్పే ఎత్తుబడుట

క్రీస్తు ఒక్కసారి కాదుగాని రెండు సార్లు తిరిగి వస్తాడని వెయ్యేండ్ల వాదులు చెప్తారు. వీరి బోధ ప్రకారము ఆయన మొదట వచ్చినప్పుడు మృతులైనట్టియు, సజీవులైనట్టియు తన అనుచరులను రహస్యముగా కొనిపోవుటకు ఆయన వచ్చును. ఇదే ఎత్తబడుట అని వారు చెబుతారు. ఇలాగ రహస్యముగా ఎత్తబడిన వారు తీర్పు తీర్చబడి తమ ఫలములను పొందుతారు. మరి ఏడు సంత్సరముల మట్టుకు వారు ప్రభువులో పరలోకములో ఉంటారని వారు చెబుతారు.

### ఎత్తుబడుట

లేఖనాల్లో 'ఎత్తబడుట' అనే మాట గాని దాని బోధగాని ఏమీలేదు. సరిగదా క్రీస్తు మరలా వచ్చునప్పుడు ప్రతీ నేత్రము ఆయనను చూచునని బోధించు చున్నవి (ప్రకటన 1:7). మరియు ఆయన గొప్ప ఆర్భాటముతో అగ్ని జ్వాలలతో, బూరధ్వనితో వచ్చునని అవి బోధించు చున్నవి (2 పేతురు 3:10; 1థెస్స 4:16; 17:2, 1థెస్స 1:7-10). అంతేకాకుండా క్రీస్తు ఇంకా ఒకే ఒక్కసారి మాత్రమే తిరిగి వచ్చునని లేఖనములు బోధించు చున్నవి (హెబ్రీ 9:28). అప్పుడు నీతిమంతులు, దుర్మార్గులు కూడా తీర్పు తీర్చబడి తమ క్రియలను బట్టి ప్రతిఫలమును పొందుదురు (2కొరింధి 5:10; ప్రకటన 22:12). మరల గురుగులను గూర్చి క్రీస్తు చెప్పిన ఉపమానము ప్రకారము దుర్మార్గులకు శిక్ష విధింపబడక ముందు నీతిమంతులు ప్రత్యేకముగా తీర్పు తీర్చ బడుటకు రహస్యముగా కొనిపోబడుదురు (మత్తయి 13:24-43). అట్టి అబద్ధ బోధకు దేవుని వాక్యములో సమయం, స్థానం ఇయ్యబడలేదు.

### మహాశ్రమల కాలము

పరిశుద్ధులు పైకెత్తబడిన తరువాత, ఏడుసంవత్సరముల మట్టుకు మహాశ్రమల కాలము సంభవించునని వెయ్యేండ్ల పాలనా వారు వాదిస్తారు. పైకెత్తబడగా భూమి మీద మిగిలిపోయిన వారుఅంతకంతకు ఎక్కువయిన శ్రమలను ఎదుర్కొంటారు. ఈ ఏడు సంవత్సరాలలోను (ఎత్తబడియున్న కారణము వలన భూమి మీద క్రీస్తుగాని, పరిశుద్ధాత్ముడు గాని, రక్షింపబడిన వారెవరు గాని లేకపోయినను) ప్రజలు ఎలాగో ఒకలాగున యేసుక్రీస్తువైపు మార్పు జెందుతారు. ఈ ఏడు సంవత్సరముల శ్రమకాలపు మధ్యలో మహాశ్రమ కాలము ఆరంభమగును.

అంత్య క్రీస్తు దర్శనమిస్తాడు. అప్పుడు ఇశ్రాయేలీయులు అతనితో నిబంధన చేసుకుంటారు. క్రొత్త పరిశుద్ధులు హతమార్చబడతారు. పరిస్థితి అంతా పాడైపోతాది. చివరిగా మానవ జాతి నాశనము గావించబడక ముందు, క్రీస్తు తన రాజ్యమును స్థాపించుటకు మరింకొకసారి దర్శన మిస్తారు. పైకెత్తబడుటను గూర్చినయట్లే ఈ మహాశ్రమ కాలమును గూర్చి కూడా వెయ్యేండ్ల వాదులు పొరబడ్డారు.

క్రొత్త నిబంధనలో యేసుగాని, అపొస్తులుగాని శ్రమను గూర్చి కనీసం ఇరవైసార్లు పలికారు. శ్రమ అంటే నమ్మకమైన క్రైస్తవులకు కలిగే బాధలు, శోధనలు, హింసలని వారి ఉద్దేశము. యేసు ఇట్లన్నారు : "దాసుడు తన యజమాని కంటే గొప్పవాడు కాడని నేను మీతో చెప్పిన మాట జ్ఞాపకము చేసికొనుడి. లోకులు నన్ను హింసించిన యెడల మిమ్మును కూడ హింసింతురు'' (యోహాను 15:20). "మీ సహోదరుడును, యేసును బట్టి కలుగు శ్రమలలోను రాజ్యములోను, సహవాసములోను పాలివాడునైన యోహాను అను నేను" అని యోహాను తన్ను గూర్చి చెప్పుకున్నాడు. (ప్రకటన 1:9). "అనేక శ్రమలు అనుభవించి మనము దేవుని రాజ్యములో ప్రవేశింప వలెను" అని అపొ. కార్యములు 14:22 బయలు పరుచుచున్నది. అట్టి శ్రమలలో పాలివారై యున్నట్టుగా మనము మహా ఆనందముతో సంతోషించాలి. (1పేతురు 4:13) ఏలయనగా పరలోకమందు మన ఫలము అధికమగును (మత్తయి 5:10-12). ప్రభువు వచ్చు వరకు ఈ లోకము అంతమయ్యే వరకు శ్రమలు కలుగుచునే ఉంటాయి

## ముగింపు

క్రీస్తు విధించిన రక్షణ షరతుల నంగీకరింపని వానికి రెండవ తరుణం అంటూ ఏమీ ఉండదు. క్రీస్తు మరల వచ్చునప్పుడు అంతము సంభవించును. అయితే క్రీస్తు మరల ఎప్పుడు వచ్చుచున్నారు? దేవునికి తప్ప మరెవరికి తెలియదు (మత్తయి 24:36). "అయితే ప్రభువు దినము దొంగ వచ్చునట్లు వచ్చును. ఆ దినమున ఆకాశములు మహాధ్వనితో గతించి పోవును. పంచభూతములు మిక్కుటమైన వేండ్రముతో లయమైపోవును, భూమియు దానిమీదనున్న కృత్యములు కాలిపోవును" (2పేతురు 3:10). యేసుక్రీస్తు మరల తప్పక వచ్చుచున్నారు, గాని వెయ్యేండ్ల పాలనావాదుల కార్యక్రమము ప్రకారము కాదు. ''ఇదిగో ఇప్పుడే మిక్కిలి అనుకూలమైన సమయము, ఇదిగో ఇదే రక్షణ దినము" (2 కొరింధి 6:2). ప్రభువు ఎప్పుడు వచ్చునో ఎవనికి తెలియదు గనుక మెలకువగా వుండి ప్రార్థన చేయుడి (మత్తయి 24:42, మార్కు 13:13). నీవు ఇప్పుడు ఆయన రాజ్యనివాసుడవా? ఆయన రాకడకొరకు సిద్ధపడియున్నావా?

మాంటీ మెక్‌నైర్

# సంక్షిప్త వార్తలు

2016 జూలై 21, 22, 23 తేదీలలో భీమవరం, మెంటే వారి తోటలోని క్రీస్తుసంఘము తమ వార్షిక సువార్త కూటములు ఘనముగా నిర్వహించిరి. ప్రతి కూటమునకు అనేకమంది స్థానికులు హాజరై దేవుని వాక్యమును అత్యాసక్తితో ఆలకించి మేలు పొందిరి. మొదటి రోజున సోదరులు మేడపాటి దేవానందం (తాడేపల్లి గూడెం), రెండవ రోజున సోదరులు జాషువా గూటం, మూడవరోజు సోదరులు పి.డి. బిషప్ (మండపేట) గార్లు దేవుని వాక్యపరిచర్యచేసిరి.

భీమవరం మెంటేవారి తోటలో సోదరులు కొండేటి హనోకు గారు 22 సంవత్సరముల క్రితము క్రీస్తు సంఘ పరిచర్యను ప్రారంభించి నేటి వరకు జయప్రదముగా దేవుని పనిని కొనసాగించుచున్నారు. భీమవరం మెంటేవారితోటలోనే గాక పాలకోడేరు మండలం మయప గ్రామములో కూడ ఆయన తన పరిచర్యను కొనసాగిస్తూ యున్నారు. తదుపరి ఆయన కుమారుడు కొండేటి టైటస్ గారు బైబిలు తర్ఫీదును పొంది పై రెండు సంఘములలోను, పలు గ్రామములలోను కూడ దేవుని వాక్యమును సమర్థవంతముగా బోధించుచున్నారు. ఆయన పాలకొల్లులో నడిపింప బడుచున్న బైబిలు తర్ఫీదు కేంద్రములో లెక్చరర్‌గా కూడపని చేయుచు క్రీస్తుసంఘాభివృద్ధికి తోడ్పడుచున్నారు.

పై తేదీలలో సువార్త కూటములు ఘనముగా, సంతోషదాయక వాతావరణములో జరిగెను. హాజరైన వారందరు క్రీస్తులోని సహవాస మాధుర్యమును చవిచూచిరి.

2016 ఆగష్టు 3వ తేదీనాడు ఆంధ్ర, తెలంగాణ క్రీస్తు సంఘ సువార్తికుల సహవాస కూటము సికింద్రాబాద్‌లో జరిగెను. దానికి యువకులు ఉడుముల వందన్ కుమార్ గారును (మియాపూర్), ఆయన సోదరుడు

యు. రాజారావ్ గారును సారధ్యము వహించి అత్యంత ఘనమైన రీతిగా కూటమును నిర్వహించిరి. అన్ని విషయములలోను చక్కని ఏర్పాట్లు చేసిరి. పలుప్రాంతముల నుండి ఆరువందలకు పైగా సువార్తికులు హాజరై అనుభవజ్ఞులైన సువార్తికులు వాక్యపరిచర్య చేయగా సంతోషించిరి, దేవుని స్తుతించిరి.

2016 నవంబర్ 8,9,10,11 తేదీలలో కాకినాడ సత్యవాణి - క్రీస్తు సంఘము బైబిల్ లెక్చర్‌షిప్ జరిపించుచున్నారు. దానిలో అమెరికా, ఇండియా సోదరులు వాక్యపరిచర్య చేయుదురు. ఆ నాలుగు రోజులు హాజరైన వారికి ఉచిత భోజన వసతి సదుపాయములు కల్పించబడును. బైబిలు సత్యములను మరింత లోతుగా గ్రహించు నిమిత్తము ఈ లెక్చర్‌షిప్‌లు సహాయపడును. అందరూ ఆహ్వానితులే.

**RNI Regd. No. 69973/98**
**Postal Regd. No. AP/KD-02/2015-17**
Date of Posting: 14 & 15th every month

**From :**
**SATYAVAKKU**
**P.O. Box 80, Kakinada - 533 001**



Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004.